"మాధవీ! నీవు రాసిన ఉత్తరం అందింది.

నీ కెంత నిష్ఠురం, మాధవీ! నీవు నిజంగా మనిషివా, దేవతవా అనిపిస్తూంది! నీ సాహచర్యంలో మీ శ్రీవారు ఎలా మారిఉంటారో చూడాలని ఉంది. మీ బాబు క్షేమం అనుకుంటాను. రేణుక బాగా కబుర్లు చెబుతున్నదా? సివ్వాలో చలి బాగా తగిందా?

నా విషయం గుచ్చి గుచ్చి అడిగావు. నీ కంటె ఆత్మీయులు నా కెవరున్నారు గనక! అదంతా ఓ పెద్ద కథ. నే నొక శాపగ్రస్తననుకుంటాను. అంతే. అంతకంటే ఏం చెప్పేది? కథంతా చెబుతా, విను!

అతనితో నా పరిచయం చాలా విచిత్రమయిన పరిస్థితుల్లో జరిగింది. కిందటి వేసవి సెలవుల్లో మా పిన్నికూతురు నళిని పెళ్ళికి కాకినాడ వెళ్ళాను. పెండ్లితతంగం అంతా పూర్తి అయింది. వధూవరులు పీటలమీదనించి లేచారు. పెండ్లిపందిరి అంతా బంధుమిత్రులతో కిటకిటలాడుతున్నది. వంట పందిరి వైపు వెళుతున్న నన్ను "రాగిణీ, రాగిణీ" అని ఎవరో పిలిచిన కేక! వెనక్కి తిరిగి చూస్తే మా మురళీధర్! అతని వెనకాలే మరొక అపరిచిత వ్యక్తి! ఆయన్ని ఎక్కడా చూసినట్టు లేదు.

"రాగిణీ! ఈయన మిస్టర్ గోపీనాథరావు, యమ్.ఎ., బి. యల్. నాగపూర్ హైకోర్టులో ప్రాక్టీసు చేస్తున్నారు. ఈమె మా పిన్ని కూతురండీ! పేరు రాగిణి. యమ్. ఎ. చేసింది. ఉమెన్సు కాలేజీలో లెక్చరరుగా పనిచేస్తున్నది" అంటూ ఆ వ్యక్తిని పరిచయం చేశాడు.

"వెరీ గ్లాడ్ టు మీట్ యు" అంటూ చేతులు జోడించి నమస్కరించాడు గోపీనాథరావు. నిండైన విగ్రహం! తదేకంగా చూస్తున్న కళ్ళు! చిరిపిగా పలకరించకుండానే పలకరిస్తున్నట్టున్న పెదవులు! అన్నిటికి మించిన అతని మంచితనము స్ఫుటంగా కనిపించాయి. ఫార్మల్‌గా నేనుకూడా ప్రతినమస్కారం చేశాను.

ఆ నాటి ఉదయంనించి నన్నే పరిశీలనగా చూస్తున్న ఆ వ్యక్తిని, ఆ కళ్ళను నేను చూడకపోలేదు. అతను పెళ్ళికూతురువైపు బంధువో, పెళ్ళికుమారునివైపు బంధువోకూడా తెలియదు. మా మురళీధర్‌కు అతను ఎలా తెలుసో, ఎప్పటినించి తెలుసో నే నడగనూ లేదు, అతను చెప్పనూలేదు.

ఆ పెళ్ళినాటి రాత్రి బ్రహ్మాండంగా పెళ్ళి విందులు జరిగిపోయాయి. భోజనాలు అయ్యాకాక ముందే మంచి ఘడియలు దాటిపోతాయని అప్పగింతలు కూడా జరిపించి, పెండ్లికూతుర్ని విడిది ఇంట్లోకి పంపేశారు. పళ్ళుల భారంతో, వడికట్టు బియ్యంతో మా నళిని కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి అత్తవారింటికి వెళ్ళిపోయింది. నేనుకూడా పెళ్ళివారిని సాగనంపటానికి కారుదాకా వెళ్ళాను. రావు విసవిసా నడిచి వచ్చి ముకుళితహస్తాలతో సెలవు తీసుకున్నాడు "వెళ్ళివస్తానండీ" అంటూ.

ఆ తరవాత రెండు నెలల కనుకుంటాను.

ఒకనాటి సాయంకాలం కాలేజీనించి హాస్టల్‌కి వచ్చేసరికి నా కోసం ఒక కవరు ఎదురుచూస్తున్నది. పరిచయమయిన దస్తూరి కాదు. ఎవరా అని ఊహిస్తూ చింపి చూశాను.

**తాను ప్రేమించిన పురుషుడు తనకు భర్తకావాలని స్త్రీ కోరుకుంటుంది. కాని తాను ప్రేమించిన స్త్రీ తనకు భార్య కానవసరంలేదనీ, ప్రేయసిగా ఉంటె చాలని పురుషుడు అనుకుంటాడు. పెద్దచదువులు చదివిన యువతి, అన్నింటిలో తనకంటె అధికుడైన భర్తనే కోరుతుంది. కాని వయస్సు అనేది మనస్సులను కాటువేసి పరుగెత్తుతుంది.**

---

అందులో మూడే మూడు ముక్కలు! కింద "గోపీనాథరావు" అనే సంతకం!

"రాగిణీ! మీతో కలిగిన కొద్దిపాటి పరిచయాన్ని పురస్కరించుకొని మీకీ ఉత్తరం రాస్తున్నందుకు మన్నించండి. నేను మీ శ్రేయోభిలాషినని నమ్మండి. మీరు నా కెందుకో తరచుగా జ్ఞాపకం వస్తున్నారు. మీరుకూడా అలాగే నన్ను గురించి ఆలోచిస్తూ ఉంటారని భావిస్తున్నాను. దీన్నే సైకాలజిస్టులు "సూపర్ సెన్సరీ పర్‌సెప్షన్" అంటారేమో! నా ఊహ నిజమయితే మహద్భాగ్యంగా భావిస్తాను.

జవాబు రాస్తారని ఆశిస్తూ,

సెలవు,

—గోపీనాథరావు."

ఉత్తరం చదవడం పూర్తిచేసి క్షణంసేపు ఆలోచించాను. నిజంగానే అతను ఎన్నో సార్లు జ్ఞాపకం వచ్చాడు. అంతగా పట్టించుకోలేదు గాని, ఈ రెండు నెలల్లోనూ ఎన్నోసార్లు అతనితో కలిగిన పరిచయం జ్ఞాపకం వచ్చింది. అతను ఎవరయి ఉంటాడు! ఏ ఊరో! ఎవరి తాలూకో! ఏమీ తెలియదు. ఎంత సిల్లీ! ఏమీ తెలియకుండానే అతనిమీద ఏదో గౌరవభావం. బహుశః ఈ ఉత్తరం కొంటెతనానికి రాసిఉంటాడా? ముమ్మాటికి కాదు! అతను చాలా పెద్దమనిషి లాగున్నాడు! మర్యాదస్థుడు! అలాంటి భావం మెదిలినందుకు నాలో నేనే నవ్వుకున్నాను.

అయితే అతను జవాబు కోసం ఎదురుచూస్తుంటాడేమో! అవును! ఆదుర్దాగానే ఎదురుచూస్తాడు. జవాబు రాయడమా, వద్దా అని చాలా ఆలోచించాను.

వారం రోజులు గడిచాయి!

రెండు వారాలు గడిచాయి!

మళ్ళీ ఒకటవ తేదీ వచ్చింది!

ఆగస్టు నెల ప్రారంభమయింది.

సరిగ్గా నెలయింది అతను జాబు రాసి!

'ఏమనుకుంటాడో! అత నేమనుకుంటే నాకేం? ఎవరో ముక్కూ, మొహము తెలియని వ్యక్తి నా గురించి ఏమనుకుంటే నాకేం! నే నెందుకు ఖాతరు చెయ్యాలి!' అని ఎంతో తర్కించుకున్నాను. మనస్సు ఉండనివ్వలేదు. ఊరికే తొందరచేసింది.

మాధవీ! నే నిప్పుడు చెబితే నమ్ముతావో, లేదో? ఏ ముహూర్తాన ఆ బుద్ధి పుట్టిందో చెప్పలేను! జవాబు రాయడం అవసరం కాదా అంటే అంతకంటే చెప్పలేను.

కలం, కాగితం తీసుకుని గబగబా ఒకనాటి సుప్రభాతాన కూర్చుని కాఫీ అయినా తాగకుండా ఉత్తరం రాసేశాను.

"రావుగారికి,

మీ ఉత్తరానికి ఎంతో కృతజ్ఞురాల్ని. నేను కూడా మిమ్మల్ని నా శ్రేయోభిలాషిగానే భావించుకుంటున్నాను. మరి, ఉంటాను. సెలవు."

ఉత్తరం రాయడం ముగించి మళ్ళీ క్షణంసేపాలోచించాను. అరవిచ్చుకున్న గులాబీలు తలలూపుతూ మంద మారుతానికి స్వాగతం పలుకుతున్నాయి. రాత్రి పడిన మంచు ఉదయభానుని కిరణాల తాకిడికి కరిగి బిందువులై పోతున్నవి. మాలీ తోటకు నీళ్ళు పోస్తున్నాడు! "నాగూ! ఈ ఉత్తరం డబ్బాలో వేసిరా" అంటూ కవరతని చేతికిచ్చాను. మాటలోనే కవరందుకొని మాయమయ్యాడు నాగు!

గోపీనాథరావు! ఎంత చక్కని పేరు! ఎంత చక్కని విగ్రహం! ఎంత మంచిమనిషి! అతను మళ్ళీ జవాబు రాస్తే! నిజంగా జవాబు రాస్తాడా! రాయాలి! అలాగే అతను రాస్తూ ఉంటే? ఏదో మధురభావం నాలో తళుక్కున మెరిసింది.

నాకు నచ్చినవాడు . . . నన్ను గౌరవిస్తున్నాడు! మామూలుగా ఒక మిత్రుడికి రాసినట్టు రాశాను. ఇందులో తప్పేముంది?

ఆలోచనలతో సతమతమవుతూనే స్నానం, భోజనం ముగించాననిపించి, ఆనాటి దైనందిన కార్యక్రమంలో మునిగిపోయాను! కాని మనస్సెందుకో ఆరాటపడుతూంది.

ఆ రోజు కెమిస్ట్రీ లెక్చరరు "ఏమండీ, రాగిణీ! ఏమిటలా ఉన్నారు? ఇంతకీ ఏమి జరిగింది? మామూలుగా లేరే!" అని పలకరించడం ఇప్పటికీ నాకు బాగా జ్ఞాపకం.

"అబ్బే! ఏం లేదండీ! మామూలుగానే ఉన్నాను. ఏమీలేదు! నేను బాగానే ఉన్నాను" అని పైకి అన్నానుగాని చాలా ఆందోళనగా ఉంది.

'అతను ఆ ఉత్తరం చూసి ఏమనుకుంటాడో? ఏమిటీమె! ఉత్తరం రాసీరాయకముందే జవాబు రాసిందే అని చులకనభావం ఏర్పరుచుకోడు గదా! పోనీ, అత నేమనుకున్నా నాకు తెలియదు. అతను రాశాడు. మళ్ళీ మర్యాదకు నేనుకూడా రాశాను. అంతే!' అని మనస్సును ఎలాగో సమాధానపెట్టుకున్నాను.

తిరుగు టపాలో ఉత్తరం వచ్చింది. అతని దస్తూరీయే!

"రాగిణీ! నా సంతోషం మాటల్లో ఎలా చెప్పాలో అర్థంకావడంలేదు. క్రిమినల్ కేసు గెలిచి 5 వేల రూపాయలు ఫీజు పుచ్చుకున్నప్పుడుకూడా ఇంత సంతోషం కలగలేదంటే నమ్మండి! మీకు నా కృతజ్ఞత ఎలా చెప్పుకోవాలో బోధపడటంలేదు. ముత్యాలసరాల్లాంటి మీ అక్షరాలు, మీరు వెలిబుచ్చిన భావాలు చదువుతుంటే, నిజంగా నా కెంతో ఆనందం కలిగింది. అన్నట్టు, సెప్టెంబరు ఒకటవ తేదీ నా పుట్టినరోజు! శుభాకాంక్షలు పంపుతారు గదూ! మరిచి పోకండి!"

---

కృష్ణప్రియ




అతను రాసిన ఆ శైలి, నాపట్ల చూపిన ఆదరాభిమానాలు నా కెంతో నచ్చాయి. చనువుగా జవాబు రాయనా అని ప్రాధేయపడుతున్న అతని కళ్లు నా కళ్లముందు సాక్షాత్కరించాయి. నాలో కలిగిన భావాల రాపిడికి తట్టుకోలే ననిపించింది. ఏదో సంచలనం బయలుదేరింది.

మాధవీ! నీవు నా గురించి ఏమనుకున్నావనరే! వాస్తవం చెబుతాను! అతను పుట్టిన రోజుకు శుభా కాంక్షలు పంపాను. అంతేకాదు. ఏదైనా ప్రెజెంటు కూడా పంపాలనిపించింది. కాని నాలోని పిరికితనం నా చేత వెనకంజ వేయించింది. ప్రెజెంటు పంపేటంత పని చెయ్యలేదుకాని, ఉరకలువేసే నా మనస్సు మళ్లీ నాచేత ఉత్తరం రాయించింది.

మిస్టర్ రావు వెంటనే జవాబు రాశాడు. నా ఉత్తరం అందుకొని 10 సంవత్సరాలు చిన్నవాడయినా నని రాశాడు. "మీ స్నేహం నాకు అమృతప్రాయం! అది వెయ్యి ఏనుగుల బలం ఇస్తున్నది. మీవంటి స్నేహితులుంటే నాకు ప్రపంచంలో ఇంకేం కావాలి? ఇదేదో వింతగా ఉంది. ఇన్ని వందల మైళ్ల దూరం నించి మిమ్మల్ని చూడగలుగుతున్నాను. మీరంటే నా కెంతేనా ఇష్టం!" అంటూ ఏమేమో రాశాడు.

మాధవీ! నిజంగా నీవు చెప్పు. అత నలాంటి ఉత్తరా లెందుకు రాయాలి?

అతన్ని గురించి ఆలోచించినకొద్దీ నాలో అతనిపై ప్రగాఢమైన విశ్వాసం కలిగింది.

నాలోని ఏదో శక్తి "అతను నీ వాడు. తెలివి తక్కువగా దూరం చేసుకోకు!" అని రొద చెయ్యడం ప్రారంభించింది.

ఆ రోజు ఆదివారం అనుకుంటాను. తీరిగ్గా కూర్చుని సుదీర్ఘమైన లేఖ రాశాను. ఒక్కొక్క మాటా రాస్తుంటే నాలో సందేహాలు, శంకలు బయలు దేరాయి. వాటన్నిటికీ అతన్నే అడిగి జవాబు తెలుసుకోవా లనిపించింది. సూటిగా అడిగేశాను.

"పెండ్లి, ప్రేమ, స్త్రీపురుష సంబంధం అనే విషయాలమీద మీ కెలాంటి భావాలున్నవో నాకు తెలియదు. కాని మిమ్మల్ని నేను ప్రేమిస్తున్నాను! మీరు నా హృదయంలో చిరస్థాయి అయిన ఒక స్థానం సంపాదించుకున్నారు. మీకుకూడా నన్ను గురించి ఏవో భావాలున్నవని మీ ఉత్తరాలవల్ల తెలుస్తూంది. నే నూహించిన ఈ పరిస్థితే నిజమయితే అంతకంటే మించిన అదృష్టం మరొకటుండదు. మీ కభ్యంతరం లేకపోతే మిమ్మల్ని నా స్వంతం చేసుకోవాలని ఉంది. నిజమే! మీరు రాసింది నిజమే! నాకుకూడా ఇదొక విచిత్రానుభూతి. సూటు వేసుకుని, మెడకు టై కట్టుకున్న ఏ వ్యక్తి ఎక్కడ కనిపించినా, మీకోసం నా కళ్లు వెదుకుతున్నవి. నాకే అర్థం కావటం లేదు. రావుగారూ! మీరు అతిశయోక్తి అనుకోకపోతే ఒక్క విషయం చెబుతాను. మీ గురించిన ఊహలు నన్ను సరో మనిషిగా మార్చేస్తున్నవి. గుర్తించలేని ఏదో సంక్షోభం నాలో బయలుదేరింది. జీవితంలో ప్రతిదీ మధురాతి మధురంగా కనపడుతున్నది!" ఆ ఉత్తరం ముగించేసరికి

ఏదో స్వప్నజగత్తులో తేలియాడుతున్నట్లనిపించింది, మాధవీ!

దానికి జవాబు ఎక్స్‌ప్రెస్ డెలివరీలో వచ్చింది.

"రాగిణీ! మీ ఉత్తరం ఎన్నిసార్లు చదువుకున్నానో, నాలో ఎలాంటి అనుభూతి కలిగిందో ఎలా చెప్పను! మనస్సు విప్పి చెప్పాలంటే మాటలు చాలడంలేదు. దయచేసి ఇకమీదట నన్ను "మీరు" అని సంబోధించ కండి. ఆత్మీయులమధ్య అలాంటి సంబోధనలు నాకిష్టం లేదు. నన్ను పరాయివాణ్ణిగా చూడకండి! మీ కభ్యంతరం లేకపోతే మిమ్మల్నికూడా రాగిణీ అనే పిలుస్తాను. ఇంకా, ఇంకా చాలా వ్రాయాలని ఉంది! కాని నాకు కవిత్వం రాదు. ఏం చెయ్యమంటారు! నన్ను ఎప్పుడో "స్వంతం చేసుకోవాలని ఉంది"ని రాశారు. చెప్పనా, రాగిణీ! నే నప్పుడే మీ సొత్తయ్యాను! నా హృదయాన్ని ఆకట్టుకున్నారు. ఇలా రాసినందుకు కోపిస్తారా, లేక నవ్వుకుంటారా? మీ రెలా అనుకున్నా సరే! నా మనస్సులోని మాట చెప్పాను. అయితే మీరు "ప్రేమ" అనే మాట వాడారే, దాని స్వరూపంకాని, అర్థంకాని నాకు తెలియదు. మామూలుగా అందరూ వాడే పరిభాషలో నాకు నచ్చదు. ఒక మనిషికీ, మరొక మనిషికీ మధ్య గల ఆత్మీయత నేను గుర్తిస్తాను. అలాంటి భావం ఒక వ్యక్తిమీదే కలగాలనీ, లేదా మీ భాషలో ఒక వ్యక్తి మరొక వ్యక్తి ప్రేమించాలనే సిద్ధాంతం నాకు నచ్చదు. ఇద్దరు, ముగ్గురి మీదకూడా ఉండవచ్చు. సమానంగాకూడా ఉండవచ్చు. అందరూ అందర్నీ ప్రేమించలేరు! ఏ ఒకరిద్దరు వ్యక్తులమీదనో ఇష్టం ఏర్పడుతుంది. మీ రిక ఆ భావం చెరిపేసుకోవాలన్నా పోదు. ఆ ఆత్మీయతాభావానికి నే నెక్కువ విలువ ఇస్తాను. ఇక పెళ్ళి అంటారా? అది కేవలం సాంఘిక మైన కట్టుబాటు మీ ప్రశ్నకు నా జవాబు ఇదే! మీ రేదో చాలా మాటాడాలని అనుకుంటున్నట్టున్నారు! త్వరలోనే మీ ఊరు వస్తున్నాను. కోర్టు పనులున్నాయి. అప్పుడు సమక్షంలో సావకాశంగా అన్ని మాటాడుకుందాం. ఉంటాను. సెలవు" అంటూ ఉత్తరం ముగించాడు.

ఏం చెప్పమంటావు, మాధవీ! నా కా ఉత్తరం అర్థం అయీ కానట్టుగా ఉంది. సరిగ్గా దాదాపు ఇలాంటి భావాలు నాకూ ఉండేవని నీకు తెలుసు! కాలేజీలో చదువుకునే రోజుల్లో వాదించేదాన్ని గుర్తుందా! ప్రేమ, ప్రేమంటూ జీవితం విషాదాంతం చేసుకోవటం శుద్ధ అవివేకం అని నేను, కాదని నీవు దేవదాసు సినిమాచూసిన రోజుల్లో హోరాహోరీగా పోట్లాడుకునే వాళ్లం, గుర్తుందా? దేవదాసు పిరికిపంద. జీవితాన్ని చూసి పారిపోయిన భీరువు. సంకల్పబలం, మనోబలం లేని అర్భకుడు అని తర్కం చేసేదాన్ని. మీ రంతా విమర్శించేవాళ్లు కదూ! అంతేకాదు. బహుభార్యాత్వ చట్టం పార్లమెంటులో పాసవుతున్న రోజులవి. మనకో వాగ్వాదం పోటీ కూడా జరిగింది. నన్ను మీరంతా తిట్టినా నాకో బహుమతికూడా వచ్చింది. ఒక పురుషుడు ఇద్దరు, ముగ్గురు భార్యలను, వారికి పుట్టిన బిడ్డలను సమానంగా చూసుకోగలిగినప్పుడు ఎవరికిమాత్రం ఏం అభ్యంతరం ఉండాలి! చట్టం పేరుతో సంకెళ్లు వేస్తే మనిషి దాన్ని ఉల్లంఘించడానికే ప్రయత్నిస్తాడు. 'ధర్మశాస్త్రమిచ్చిన స్వేచ్ఛ ఈ బహుభార్యాత్వ నిషేధచట్టం అపహరిస్తున్నది' అనేది నా అభిప్రాయం. ఒక పురుషునికి ఒకే భార్య ఉండాలనేది నాగరికుల లక్షణం అని నీవు వాదించేదానివి. కాని సమాజంలో ఈ నాగరికతా సూత్రాన్నే అందరు పాటిస్తే ఇప్పుడు లోకంలో జరుగుతున్న అనర్థాలన్ని ఎందుకు జరుగుతాయి? ఎందు కింతమంది స్త్రీలు అవివాహితలుగా ఉండిపోతున్నారు! తల్లి ఎవరో, తండ్రి ఎవరో తెలియని పసిబిడ్డలు ఎక్కడినించి ఉద్భవిస్తున్నారు! సమాజం ఎందు కింత అధోగతి పాలవుతున్నది!

* * *

మనిషి నైజం చాలా విచిత్రమైంది!

గోపీనాథరావుఎందుకివన్నీ రాస్తున్నాడో! వివాహితుడు కాడుగదా! ఏదీ తెలుసుకోలేదు! అతన్ని ఎందు కలా గౌరవించానో తెలియదు. చెప్పలేను. నా కతను కావాలి. అతని ఆత్మీయత కావాలి. అంతే! మిగతావన్నీ అనవసరం! మాధవీ! ప్రపంచంలో అతనొక్కడే నాకు కావలిసిన వాడుగా కనిపించాడు! మిగతావన్ని చాలా చిన్న విషయాలుగా తోచాయి!

రావుగారు మా ఊరు వస్తానన్న రోజు రానే వచ్చింది. గంటలో వస్తున్నానని ఫోను చేశాడు. ఆ నాటి సంరంభం ఏమని చెప్పేది, మాధవీ!

సాయంత్రం 5 గంటల వేళ! తెల్లని చీరె కట్టుకుని తలనిండా జాజిపూలు ముడుచుకోవడమంటే నాకెంతో ఇష్టం! సరిగ్గా అలాగే ముస్తాబు చేసుకున్నాను. కళ్లనిండా కాటుక, పెద్ద బొట్టు పెట్టుకున్నాను. పెట్టెలో మూలుగుతున్న ముత్యాలనెక్లేసు తీసి మెడలో అలంకరించుకున్నాను. అస లతనికి ఎలా అలంకరించు కుంటే ఇష్టమో తెలియదు! నా ఈ అలంకరణ చూసి పాతకాలపు మనిషి అని నవ్వుకోడుగదా! అలా అని అర్ధనగ్నంగా అలంకరించుకోవడము, అధునాతన యువతిగా కనపడడమూ నాకు నచ్చదు. ముచ్చెమటలు పోస్తున్నాయి! అద్దంలో పదేపదే చూసుకున్నాను. ఎలాగో ముస్తాబు ముగించేసరికి ఆరు గంటలు కావచ్చింది. గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి.

అతన్ని ఎలా పలకరించాలి! తదేకంగా నావైపే చూస్తుంటే ఎలా సహించడం!

మా హాస్టల్ ముందరి లాన్‌లో కూర్చుని నిరీక్షిస్తున్నాను. అతను చెప్పిన వేళకే వచ్చేశాడు! తనే కుర్చీ దగ్గిరగా లాక్కుని కూర్చున్నాడు. నీలిరంగు పాంటుమీద తెల్లని షర్టు వేసుకున్నాడు! ఈసా రెందుకో కోటు లేదు.

మా మధ్య చాలాసేపు మాటలే లేవు.


ఎవర్ని ఎవరు ఎలా పలకరించాలో ఇద్దరికీ తోచ లేదు. ప్రతిమల్లా కూర్చుండిపోయాం!

ఆఖరికి అతనే అనుకుంటాను, "బాగున్నారా! కాలేజీ కబుర్లేమిటి?" అని సంభాషణలోకి దింపాడు. కోర్టులు, వ్యవహారాలు, రాజకీయాలు, సినిమాలు, కాలేజీలు, ఒకటేమిటి. . . లోకంలోని సమస్త విషయాలు మాట్లాడుకున్నాం! కులాసాగా నవ్వుకున్నాం. అది ఆనందమో, పరవశత్వమో, ఉద్వేగమో! నే నేమీ చెప్పలేను! మాధవీ! అతని సాన్నిధ్యంలో ఎంత హాయి! ఎంత సాంత్వన! అలాంటి మనిషిని నే నెప్పుడు, ఎక్కడ చూడనేలేదు! అతను మామూలు మనిషి కాదు. నీ వతన్ని చూడలేదు, మాధవీ! అతడొక అతిలోక వ్యక్తి!

ప్రతి వారం ఉత్తరం రాస్తానని ప్రమాణం చేయించుకున్నాడు! మా ఊళ్లో పెద్ద కేసొకటి చేపట్టాననీ, తరుచు రావలిసిన పని ఉంటుందని చెప్పాడు. మాధవీ! అతనెలా నవ్వుతాడనీ! ఓ! ఆ నవ్వు! అదొక సమ్మోహనాస్త్రం! ఇలాగే అతన్నే. . . ఎప్పుడూ చూస్తుంటే ఎంత బాగుండును అనిపించింది. ఎంత దీననైపోయానో ఎలా చెప్పేది!

"వెళ్లివస్తా" నంటూ సెలవు తీసుకోబోతూ లేచి నిలుచున్నాడు. మూగగా కుర్చీలోంచి లేచి నేనూ నిలుచున్నాను. అసలు నే నేమయిపోతున్నానో నాకు తెలియడంలేదు! ముసిముసినవ్వులు నవ్వుతూ . . . జరుగుతూ. . . జరుగుతూ. . . నాకు బాగా దగ్గిరగా. . . చాలా దగ్గిరగా. . . ఇంకా దగ్గిరగా. . . వస్తున్నాడు. ' అప్పటికి బాగా చీకటి పడిపోయింది. నిర్జనమైన ఆ ప్రదేశంలో చీమ చిటుక్కుమనడం లేదు. దూరంగా మినుకు మినుకుమంటూ దీపాలున్నాయి! ఆవేశంతో పొడవైన, బలమైన అతని బాహువులతో నన్ను పొదివి పట్టుకున్నాడు. ఒదిగిపోయాను. ఏం జరుగుతున్నదో తెలుసుకునేలోపలే నానుండి విడిపోయి అల్లంతదూరంలో నిల్చున్నాడు. నా నొసటి కుంకుమ షర్టుకు అంటుకుంది కాబోలు కర్చీఫుతో తుడుచు కుంటున్నాడు.

"నామీద కోపంగాని వచ్చిందా?" అని ప్రశ్నించాడు. జవాబివ్వలేక శిరస్సు వంచిఉన్న నన్ను



చుబుకం ఎత్తి, "ఊఁ! చెప్పు! కోపం లేదు కదూ" అని అడిగాడు కళ్లల్లోకి చూస్తూ.

జవాబు కోసం చూడకుండానే "వస్తా"నంటూ నడిచి వెళ్లిపోయాడు! చీకటిలో అతనలా అదృశ్యమై పోతూంటే వెనక్కి పిలవాలనిపించింది. 'అలా వెళ్లద్దు. ఎప్పటికీ నా దగ్గరే ఉండు. లేదా నన్ను నీతో తీసుకుపో!' అని చెప్పాలనిపించింది. కాని వీటన్నిటికి వ్యవధి ఏదీ? అతను వెళ్లిపోయాడు! హాస్టల్‌గంట గణగణా మోగింది

* * *

ఆనాటినించీ జీవితం అతనితో ముడి పెట్టుకున్నట్లయిపోయింది. అతను లేనిది ఏదీ వద్దు! ఉత్తరం రావటం ఒక్క పూట ఆలస్యమయిందంటే ప్రాణం విలవిలలాడిపోయేది. అతని చుట్టూ ఎన్నో ఊహలు సృష్టించుకోసాగాను. అతను అలాగే కనిపించాడు. ఆదివారం వచ్చేసరికి ఉత్తరం అందకపోతే చిన్నపిల్లాడిలాగా మారాంచేస్తూ వ్రాసేవాడు.

"నీకు దగ్గరగా ఉండాలనీ, నీ కళ్లల్లోకి చూడాలనీ అనిపిస్తూంది. నీ వెప్పటికీ నా దానివి. ఉత్తరం రాయటం ఆలస్యంచేస్తే ఏం చేస్తానో తెలుసా! సత్యాగ్రహం చేస్తాను. అంతేనా! అమ్మాయిగారూ! మీ హాస్టల్ ముందర ఘెరావో చేస్తాను. బాగా జ్ఞాపకం పెట్టుకోండి" అంటూ రాసేవాడు.

* * *

అతని ఉత్తరాలు చదువుతూంటే ఎంత హాయిగా ఉండేదనీ! కాలం దొర్లిపోసాగింది.

నానాటికీ మా ఇద్దరి మధ్యా అంతులేని అనుబంధం ఏర్పడిపోయింది.

ఒకనాడు ఉత్తరం చింపుతుంటే కాగితాలు కాక ఏదో బరువుగా కింద పడింది. తేరిపారజూస్తే అవి పోస్టుస్టాంపులు. ఉత్తరాలు రావటం చాలా ఆలస్యమై పోతున్నదని, ఆ స్టాంపులన్నీ నా టేబిలుపైనే పెట్టుకుని తీరిక ఉన్నప్పుడల్లా రాయుమనీ శాసిస్తూ, ప్రాధేయపడుతూ రాశాడు.

సెలవులు వచ్చాయి. కాలేజీ మూసేశారు. ఇంటికి వెళుతున్నానని, రెండు నెలలదాకా మరి ఉత్తరాలు రాయలేనని రావుగారికి రాశాను.

'అమ్మో! రెండు నెలలు ఉత్తరాలు రాకుండా ఎలా ఉండటం? నీ ఉత్తరాలు చూసి నిన్ను చూసినట్లుగానే భావించుకుంటున్నాను. అసలీ కాలేజీ వాళ్లకు తలకాయ లేదు. అయినా సెలవు లెందుకు! మనుష్యులకు మనుష్యుల్ని దానులుగా చేసుకుని దూరంగా నెట్టివెయ్యడం ఒక సరదా! ముఖ్యంగా స్త్రీల కిది వెన్నతో పెట్టిన విద్య" అంటూ చాలా చాలా రాశాడు.

సెలవులు రెండు నెలలు ఎలా గడిచిపోయాయో తెలియదు! పైపెచ్చు అమ్మ ఏదో ఒక సందర్భంలో పెళ్లిమాట ఎత్తడం మొదలుపెట్టింది. వాళ్లచేత, వీళ్లచేత చెప్పించ ప్రయత్నించింది. అన్నిటిని ఒక్క నవ్వుతో దాటేశాను. నాకు కావలసినవారిని ఎన్నుకున్నానని వాళ్లతో చెప్పే సాహసం లేకపోయింది. అతను ఎవరు? ఏమిటి? అసలు కూడా అంగీకారం తెలిపాడా? అని అడిగితే నిజంగా ఏం చెప్పేదాన్ని? అసలీ విషయం అతని ముందు రేఖామాత్రమయినా ఎత్తితేనా! ఏ ప్రశ్నలకూ నా దగ్గర జవాబులు లేవు! ఎంత మందమతినో అప్పు డర్థమయింది!



# గాంధీజీ సూక్తులు

## హిందూ మతం

నా దృష్టిలో హిందూమతం సంకుచితమైనది కాదు. అది కాలమంతటి పురాతనమైనది. జొరాస్టర్, మోజెస్, క్రీస్తు, మహమ్మద్, నానక్ వంటి మహోన్నత ప్రవక్తల బోధనల్ని అది ఆకళింపు చేసుకుంది.

(ఇది గాంధీజీ శతజయంతి సంవత్సరం)

మళ్లీ కాలేజీ తెరిచారు. అమ్మ కళ్లనీళ్లు పెట్టుకుంటూ సాగనంపింది. కొద్ది రోజుల్లోనే ఏదో నిర్ణయం చెయ్యాలనీ, ఆ శుభవార్త అమ్మకు అందజెయ్యాలని కొండంత ఆశతో హైదరాబాదు బయలుదేరాను.

నేను హైదరాబాదు వచ్చానని తెలియగానే మళ్లీ పరంపరగా ఉత్తరాలు రాయడం ప్రారంభించాడు రావు. ఈ రెండు నెలల వ్యవధిలోను కలిగిన అనుభవాలన్నీ రాస్తూ, నన్నెంతో నిందిస్తూ రాశాడు. అవన్నీ చదువుకొని ఎంతో గర్వపడ్డాను.

అసలు విషయం ఎలా అడగాలో అర్థంకాక, అతని మనోగతభావాలు తెలుసుకోవాలనే కుతూహలంతో ఒక చిన్న కథ అల్లి రాశాను. నాకు పెళ్లి కాబోతున్నదని, అతనొక పెద్ద ఇంజనీరని రాశాను. దానికి జవాబు చాలా ఘాటుగా వస్తుందని ఆశించాను. పది రోజుల దాకా అసలు ఉత్తరమే రాలేదు! 11 వ రోజున. . . ఒకే రోజున రెండు ఉత్తరాలు వచ్చాయి! ఒకటి ఆర్డినరీ; మరొకటి ఎక్స్‌ప్రెస్ డెలివరీ! మొదటి దానిలో కొంచెం బాధపడుతూ, "రాగిణీ. నీవు త్వరలోనే నాకు పరాయిదాని వయిపోతావా?" అంటూ రాశాడు.

రెండవదానిలో "పెళ్లి అయినా, ఎక్కడున్నా, ఎవరి భార్యవయినా ఎప్పటికీ నా దానివి. నా కా స్మృతి చాలు! నీవు చల్లగా, సుఖంగా బ్రతకాలి! నీ జీవితం మూడు పూలూ ఆరు కాయలూ కావాలి. రాగిణీ! నా మనస్సులో నీ మీద ఏమీ ద్వేషం లేదు! అయినా ఎందుకుండాలి?" ఇది నే నాశించిన జవాబు కానేకాదు.

నన్ను దూషిస్తూ రాస్తాడని, ఈ వార్త విని రెక్కలు కట్టుకొని వాలతాడని ఎదురుచూశాను. నన్ను మోసం చేస్తావా? మరొకరి భార్యగా సుఖంగా మనగలవా? ఏమిటీ అన్యాయం? అని నిందిస్తాడను కున్నాను. కాని అతని వలాంటిదేమీ చెయ్యలేదు. అసలు తనకేమీ పట్టనట్లు, తన విషయమే కానట్లు చాలా నిర్లిప్తంగా రాశాడు. నాకు కావలిసింది, నేను కోరుకున్నది నన్ను కోరే అతని హృదయంకాని అతని సానుభూతి కాదు, మాధవీ! ఆ నిర్లక్ష్యం నేను భరించలేకపోయాను.

గోపీనాథరావు నిజంగా నాకు దూరమయితే నేను భరించగలనా? కాక అతడు నన్ను స్వీకరిస్తే సంతోషిస్తానా! నాలో ఉన్న స్త్రీహృదయం అతనికోసం తహతహ లాడింది! అతని నీడనే, అతన్ని అంటిపెట్టుకొని బ్రతకాలనే నా కోరిక! అతను అన్ని విధాలా ఉన్నతుడు. సహృదయుడు. నా సర్వస్వం అతనే అనుకున్నాను.

కాని అతని మనస్తత్త్వం ఏమిటో అర్థం కాలేదు. దేనికి సూటిగా జవాబివ్వడు. తనకు తానుగా నాతో పరిచయం పెంచుకొని నాలో అపూర్వమైన ఆశలు రేకెత్తించాడు. కాని నేను చేరువ కాబోతుంటే దూరంగా జరిగిపోబోతాడు. ఇదేమిటో! వింత ప్రకృతి! నా మనస్తత్త్వం వేరు. నీకు తెలుసుగా! ఏదీ పట్టించుకోను. ఏదైనా వెయ్యదలుచుకుంటే కడదాకా చాలా పట్టుదల! అతని లా కాదు. నీడలాంటి మనిషి. తేలిగ్గా అర్థం కాడు. మా ఇద్దరివి విభిన్న మనస్తత్త్వాలని మొదటిసారిగా అర్థం చేసుకున్నాను.

ఇంకా ఏం చెయ్యమంటావు, మాధవీ! హఠాత్తుగా అతను ఉత్తరాలు రాయడం మానేశాడు. నాకేమీ తోచలేదు. ఒక వారం, రెండు వారాలు, మూడు వారాలు, నాలుగు వారాలు చూస్తూండగానే గడిచి పోయాయి! ఈలోగా నేను పది ఉత్తరాలయినా రాసి ఉంటాను. ప్రతి ఉత్తరానికీ జవాబు వస్తుందనే ఎంతో ఆదుర్దాగా ఎదురుచూశాను! ఊహూఁ! అతను రాస్తేగా? ఆఖరుకు నెల రోజుల తరవాత ఒక్క ఉత్తరం వచ్చింది. అతనికి సుస్తీ చేసిందని, నెల రోజులుగా కోర్టుకు వెళ్లలేదని, అందుచేత నా ఉత్తరాలేవీ చూడలేదని. . . చాలా మామూలుగా రాశాడు. అందులో క్షమాపణలు, ఆక్షేపణలు ఏవీ లేవు. కాని నా కేమీ కోపం రాలేదు.

పాలిపోయిన అతని ముఖము, హీనంగా లోతుకు

నాగపూర్ విడిచి వచ్చి వారం రోజులు పైగా అయింది. కనీసం ఒక్క ఉత్తరమయినా రాయలేదు. ఎంత నిర్దయుడు! అంత సున్నితంగా కనపడే మనిషిలో ఎంత కాఠిన్యం దాగిఉంది!

ఇప్పుడు చెప్పు, మాధవీ! ఇందులో నిందితు లెవ రంటావు? అసలీ సంక్షోభాని కంతటికీ కారణం ఏమిటంటావు! నా అజ్ఞానం అంటావా, లేక అతని కపటగుణమా! ఇది కేవలం స్వయంకృతాపరాధం!

నా వ్యథ నే నెలా చెప్పేది! ఏమని వ్రాసేది, మాధవీ? ఇటువంటి క్షోభ ఏ స్త్రీ ఏ పరిస్థితుల్లోను, ఏ కాలంలోను అనుభవించకూడదని మనసారా కోరుకుంటాను. ఎవరికి ఇలాంటి దురవస్థ తెచ్చిపెట్ట వద్దని భగవంతుణ్ణే ప్రార్థిస్తాను!

ఇలాంటి సందర్భాల్లో పరిష్కారమార్గం వెతుక్కో గలిగినవాళ్లెంత అదృష్టవంతులు! అమధ్య లేడీస్ క్లబ్‌లో కమల కనపడింది. కమల అంటే జ్ఞాపకం ఉందా? మనకు సీనియర్! తెల్లగా, బారుగా ఉండేది. పెద్ద జడకూడా ఉండేది. ఈ ఊళ్లో ఆమె లేబర్ ఆఫీసరు. ఈమధ్యనే పెళ్లి చేసుకుంది. ఎవర్నో తెలుసా! ఆజాద్ అనే ముస్లింని. అతనెక్కడో కాలేజీలో లెక్చరరుట. క్లబ్‌లో కనపడి తన ఇంటికి రమ్మంది. ఆజాద్‌కు మరొక భార్య, పిల్లలు ఉన్నారని చెప్పింది. వింటుంటే నాకే ఆశ్చర్యంవేసింది. "అదెలా సాధ్యమయింది, కమలా?" అంటే, "ముస్లింలా ఒప్పుకుంటుంది. అతను భార్యను ఒప్పించాడు. హిందువులలోలాగా విడాకులు అవీ ఏమంత కష్టం లేదు. నిఖా కట్టుకున్నాం. నే నేమీ అతన్ని పోషించమని అడగనులే! నన్ను, నాకు పుట్టబోయే పిల్లలను పోషించుకునేపాటి ఆర్థిక స్తోమత నా కుంది" అని కమల చెబుతూంటే నా చెవులను నేనే నమ్మలేక పోయాను. 'అయితే, కమలా, ఆ మొదటి భార్యను ఆజాద్ చూడడం నీవు సహించగలవా?' అని అడిగాను.

"ఏం? ఎందుకు సహించలేను?" అని తపీమని సమాధానం చెప్పింది. అంతేకాదు. ఇలా రెండవ పెళ్లి చేసుకున్నవాళ్ల ఉదంతాలు చెబుతూ, వాళ్లంతా ఎంతో సుఖంగా ఉన్నారు. ఇలాంటి వివాహాలు ఈ నవీన నాగరికతలో తప్పవు, రాగిణీ! అయితే అవి సఫలం కావాలంటే కొంత సహనం, ఓర్పు కావాలి. ఎదటివాళ్ల భావాలను మనం అర్థం చేసుకుని సర్దుకుపోగలిగితే ఏ బాధా ఉండదు. అదేగా కల్చర్ అంటే? కాదంటావా అని అడిగింది! ఏమని చెప్పను? ఇదీ ఒక విధంగా పరిష్కారమార్గమే అనిపించింది. విద్యావంతులైన స్త్రీలకు, ముఖ్యంగా ఎమ్. ఎ. లు, పి హెచ్. డి. లు పాసయిన స్త్రీలకు వివాహం కావడమే ఒక సమస్యగా పరిణమించిన ఈ కాలంలో నిజంగా ఇదొక పరిష్కార మార్గమే! ఒక కొత్త సంస్కృతి, సభ్యత సమాజంలో వస్తున్నవేమో!

కానీ పురుషులు భార్యాబిడ్డలు ఉండీ, వాళ్లమీద ఎంతో ప్రేమాభిమానాలు ఉండీ ఎందు కిలా మరొక స్త్రీపై వ్యామోహం పెంచుకుంటారు?

నీ విషయం కొంత మీ అమ్మగారి ద్వారా తెలుసుకున్నాను. గుణవతి, రూపవతి అయిన భార్య ఉండగా, వ్యసనాల పాలవుతున్న నీ భర్తను ఏమనాలి! అసలు ఏమిటీ లోకం! భర్త ఎలాంటివాడయినా అతనినే ఆరాధించే నీబోటివాళ్లు, నీ భర్తలాంటివాళ్ల విలాసాలకు వినియోగపడే స్త్రీలు, స్త్రీహృదయంలో చిచ్చులాంటి ప్రేమ రగిల్చి గప్‌చుప్‌గా ఉండిపోయే గోపీనాథరావులాంటి భర్తలు, భర్తలు చాటుగా ఏం చేస్తున్నా అర్థం చేసుకోలేని అమాయికలైన భార్యలు... ఎందరెందరో! కాని అందరికీ ఓ హృదయం అనేది ఉంటుంది కదూ! జీవితాన్ని మలుచుకోవటం వారివారి భిన్నసంస్కృతులనుబట్టి ఉంటుందేమో!

నన్నేం చెయ్యమంటావు, మాధవీ? భవిష్యత్తులో ఏం జరుగుతుందో, ఏం చేయబోతానో ఏమీ చెప్పలేను.

అమ్మయ్య! నా హృదయం ఎంత తేలికపడింది, మాధవీ! నాలో ఆవేదన, ఆవేశం ఏ కోశానా లేవు. అన్నీ సమసిపోయాయి

జీవితం ఎందుకు నాపట్ల ఇంత క్రూరంగా వ్యవహరిస్తున్నదో చెప్పలేను. భగవంతుడి నిర్ణయాన్ని మార్చడానికి నే నెవర్ని?

ఏదైనా నే నీ పరిసరాల్లో ఉండలేను. కాలేజీకి వెళ్ల బుద్ధి కావటం లేదు. పాఠాలు అసలే చెప్ప బుద్ధి కావటం లేదు. ఎవరు పలకరించినా అంతులేని చిరాకు, కోపం వస్తున్నవి. దేనిమీదా ఆసక్తి లేదు. ప్రతిది అర్థవిహీనంగా కనిపిస్తున్నది. నేను నేనుగా లేను. నాకు మార్పు కావాలి. మనస్సుకు కొంత ఓదార్పు, ఆత్మీయత కావాలి. మాధవీ! నీ సాన్నిధ్యంలో కొంత కాలం గడపాలని ఉంది. రేపే సిమ్లా బయలుదేరి వస్తున్నాను. నీ భర్తకూడా ఏదో ట్రెయినింగుకు యు. కె. వెళ్లారని రాశావుగా! మరి, ఉంటాను. సెలవు."

ఉత్తరం పోను చేసి నిట్టూర్చింది రాగిణి. ★

